మూలం
పి.జి.వుడ్‌హౌస్



**IF I WERE YOU**

First published in 1931 by Doubleday in the US and by Herbert Jenkins in the UK.

Copyright by The Trustees of the Wodehouse Estate.

Reproduced by permission of the author's Estate c/o Rogers, Coleridge & White Ltd., 20 Powis Mews, London W11 1JN, UK

గబ్బిట కృష్ణమోహన్
105, Srinileya Sagar View
6-3-1099/1/9, Somajiguda
Hyderabad - 500082
Ph : 9391015247
email : mohangabbita@gmail.com

# నేనే నీవై, నీవే నేనై

కందికొండ జమీందారు చంద్రశేఖర వర్మగారి భవనం ముందుగదికి వున్న నిలువు కిటికీల్లోంచి బయటికి చూస్తే కనిపించే దృశ్యం అందరి కళ్ళని ఆకట్టుకుంటుంది. భవనం చుట్టూరా వున్న కంకరరోడ్డుకి అవతల వున్న చెట్ల మధ్యలోంచి నున్నగా, మెత్తగా తరతరాల తోటమాలీలు మలిచిన అందమైన తివాచీలాంటి లాను కనిపిస్తుంది. పొడుగాటి చెట్ల నడుమ పారే సెలయేరు దాకా ఆ లాను విస్తరించి కనుచూపు మేర దట్టమైన చిట్టడవి కొండమీదికి ఎగబాకుతున్నట్టు వుంటుంది. హాల్లోకి వచ్చే ప్రతివారూ ఏదో ఒక కిటికీ దగ్గిర నుంచుని ఆహ్లాదకరమైన ఆ దృశ్యాన్ని చూస్తూ పరవశిస్తుంటారు.

వర్మగారి యింటి నౌకరు పోలయ్య మాత్రం అలా కాదు. వాడికిదంతా పాతపాటే. టీ సరఫరా కోసం కప్పులు, సాసర్లు సర్దుతుంటే టెలిఫోను మోగేసరికి ఎత్తుదామని హాల్లోకి వచ్చాడు.

“హలో? అవునండీ, యిది వర్మదొరగారిల్లేనండి. తమరెవరండీ? ... ఎవరూ?”

వెనకాలే వచ్చిన బట్లరు కేశవులు అక్కడ జరిగేది తనకు నచ్చనట్టు పోలయ్య వంక చూశాడు. టెలిఫోను తీసి జవాబిచ్చేందుకు కొంత నేర్పు అవసరం, మామూలు నౌకర్లకి అది సాధ్యం కాదన్న అభిప్రాయం అందరు బట్లర్ల లాగానే అతనికీ వుంది. బట్లరు – అందులోనూ తనలాంటి మంచి బట్లరే – దానికి సిద్ధహస్తుడు.

“హల్–లో ... హల్–లో ... హల్–లో ... ”

ఇదంతా ఏమీ బాలేదన్నట్టు కేశవులి గుండ్రటి మొహం రంగు మారింది.

“ఏందిరా, ఏమనుకుంటున్నావ్, బర్రెల్ని తోలుతా వున్నట్టు ఏందా అరుపులు?”

“మద్రాసు నించి ట్రంకాలయ్యా, ఎవురో అయ్యగార్తో మాట్లాడాలంటయ్యా.”

“ఎవురు?”

"సరిగా యినబళ్ళేదయ్యా. గుర్రు గుర్రుమంటా మాయదారి సప్పుళ్ళు ఎక్కువొత్తన్నాయి."

"నా చేతికివ్వరా యిటు."

ఈ శషభిషలు పనికిరావన్నట్టు బట్లరు కేశవులు రిసీవరు అందుకుని చెవిలో దూర్చుకున్నంత పని చేశాడు.

"సార్, ఎవరు కావాలండీ? ... మాట్లాడలేరా ఏమిటి?" రిసీవర్ని నోటికి దగ్గిరగా పెట్టి ... "ఓ, మద్రాసు పేపరా?"

"పేపరాళ్ళా? ఏం కావాలంటా?"

చేతి కింద పని చేసే నౌకర్లు తనతో ముచ్చట్లు పెట్టుకోవడం కేశవులుకి ఏమాత్రం యిష్టముండదు. లోపలికి పొమ్మంటూ బొటనవేలు చూపించగానే అవమానంతో పోలయ్య వెళ్ళిపోయాడు.

దూరం నించి మాట్లాడుతున్న మనిషితో కేశవులు, "కాదండీ, నేను వర్మగారిని కాదండి. నేను ఆరి బట్లర్నండి ... దొరగారు కారు షెడ్డులో వుండారండీ, పిలిస్తే సిరాకు పడతారండయ్యా ... అయినా దొరగోరి సొంత యిసయాల గురించిన ప్రశ్నలకి నేనేమాత్రం బదులియ్యనయ్యా. నిజమే అయితే అన్ని పేపర్లకి సమాచారం యిత్తారండయ్యా," అని చెప్పాడు.

అప్పటివరకు బట్లరు కేశవులి మాటతీరు గంభీరంగా, రాజరికానికి తగినట్టుగా వుంది. ఇప్పుడది మారి మామూలు ధోరణిలోకి వచ్చి, "ఇదిగో ఏయ్, పెట్టెయ్యకు. మధ్యాన్నం రెండున్నర రేసులో ఏ గుర్రం గెలిచింది?" అని గట్టిగా అరుస్తూ అడిగాడు.

వెనక నించి వచ్చిన చప్పుడు విని ఆందోళనతో అటువైపు తిరిగాడు. నిలువు కిటికీ లోనించి మధ్య వయసులో వున్నావిడ లోపలికొచ్చింది. ఆమె దొరగారి అత్తయ్య హేమలతగారని చూసి కేశవులు విచారపడ్డాడు. పట్టుచీర కట్టుకుని ఏ పెళ్ళికో, పేరంటానికో, మీటింగుకో వెడుతున్నట్టు చక్కగా సింగారించుకుని వుంది. నిజానికామె అప్పుడే మీటింగుకి వెళ్ళి తిరిగొస్తోంది.

"ఏమైంది, కేశవులూ?"

"పేపరోళ్ళమ్మగోరూ. చెన్నపట్నం నించి వొచ్చే పేపరమ్మా. దొరగారు పెళ్ళి చేసుకోబోతున్నట్టు అక్కడంతా పుకార్లంట, నిజమెంతో కనుక్కుందామని ఫోన్ చేశారమ్మా."

"ఏమిటీ!"

"అవునమ్మగోరూ."

"సరే, నేను మాట్లాడుతానుండు," అన్నది హేమలత.

అయిష్టంగా వున్న కేశవులు చేతిలోంచి హేమలత ఫోను తీసుకుంటూ, "హలో, శీనూ," అంది.

చక్కగా ముస్తాబయి అప్పుడే లోపలికొచ్చిన శీను, "హలో," అని బదులిచ్చాడు. టేబులు దగ్గిరున్న పేపరు తీసుకుంటూ, "ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నట్టున్నావే?" అన్నాడు.

"అవును. మద్రాసు పేపరు ... హల్లో? వున్నారా మీరు? ... ఏమిటీ?" హేమలత ముఖంలో కోపంతోపాటు ఆశ్చర్యం కూడా తొణికిసలాడింది. సానుభూతి కోసం మేనల్లుడి వంక చూసి, "అటువైపునించి ఎవడో పిచ్చోడు నన్ను లిటిల్ బ్రైట్ ఐస్ అంటూ పిలుస్తున్నాడు," అని చెప్పింది.

"బహుశ వేరే ఎవరివో మాటలు మనదాంట్లో కలిసినట్టున్నాయి, మేడం." ఈ మాటలు అన్నది కేశవులు, మనసులో చాలా కష్టం అనుభవిస్తున్న వాడిలా చెప్పాడది. "నాకోసారి యిస్తారా మేడం ... "

టెలిఫోన్ అందుకోడానికి వస్తున్న కేశవుల్ని వారించిందావిడ. తనే వింటోంది యింకా. వింటున్నకొద్దీ ఆవిడ ముఖం విచారంగా మారుతోంది, కుంగిపోతున్న బట్లరు వంక అదే ముఖంతో చూసింది.

"ఓహో? ... ఐసీ ... " రిసీవర్ని చేత్తో మూసిందావిడ. "కేశవులూ, లిటిల్ బ్రైట్ ఐస్ అనేది రెండున్నరకి జరిగిన దాంట్లో గెలిచిందట, నీకేమైనా అర్థమైందా? టొమాటో సెకండు, హార్డ్ హెల్డ్ థర్డ్ అట. ఇంతకీ నువ్వు దేని మీద పందెం కాసినట్టు?"

ఆ బట్లరు దుఃఖాన్ని దిగమింగుకుంటూ, "ఫ్రూట్ సలాడ్, అమ్మగోరూ," అన్నాడు.

"గాడిదా! దాని అయిపే లేదు."

"అవునమ్మగోరూ."

"దాని మీద పందెం కాయమని చెప్పిన మందమతి ఎవడు?"

"శ్రీనివాసు బాబుగోరండమ్మా."

పేపరు చదువుతున్న శీను తలెత్తి చూసి, "సారీ కేశవులూ, ఇలాంటివి జరుగుతూనే వుంటాయి," అన్నాడు.

"ఈ శీను చెప్పింది నమ్మినందుకు తగిన శాస్తి జరిగిందిలే నీకు. నష్టం బాగానే అయిందా మరి?" అని అడిగింది.

కేశవులు, "అవునమ్మగోరూ," అని తన నిరాశని పంచుకోలేక వంటరిగా వుందామని వెళ్ళిపోయాడు.

హేమలత మళ్ళీ టెలిఫోన్లో సంభాషణ కొనసాగించింది.

"హలో, ... వున్నారా యింకా? ... మధ్యలో ఆపినందుకు క్షమించాలి. మా బట్లరుతో గుర్రాల సంగతి చెబుతున్నా. సరే, గుర్రాల విషయం ముగిసింది కనక యిప్పుడింక అసలు విషయానికొద్దాం. మీతో మాట్లాడుతున్నది హేమలతాదేవి, చంద్రశేఖర వర్మకి అత్తని. వర్మ మైనారిటీ తీరేంతవరకూ నా భర్తే అతని గార్డియన్‌గా వున్నాడు. ఆ? ఏమిటీ? లేదు, కాదనుకుంటాను. అతనలాంటి నిర్ణయం తీసుకునుంటే నాతో తప్పకుండా చెప్పుండేవాడు. వర్మ తల్లిదండ్రులు చనిపోయినప్పట్నించి దాదాపు పదేళ్ళుగా నేను వర్మతోనే వుంటున్నా. అదీకాక ... హలో ... ఓ, వెళ్ళిపోయారా ఏమిటి? ... సరే మరి, గుడ్‌బై."

రిసీవర్ పెట్టేసి కుర్చీలో కూలబడి, "దేవుడా! నాకు చలిజ్వరం కమ్ముకుంది," అందావిడ.

బయట ఎండకి మెరుస్తున్న తోటని చూపిస్తూ శీను, "అక్కడ కాస్త వెచ్చగా వుంటుంది చూడు," అని, "ఇంతకీ మీ పుష్ప ప్రదర్శన ఎలా జరిగింది?" అని అడిగాడు.

"ఆ, ఏముంది మామూలే. కాల్సియోరేరియా బాగుందని సర్టిఫికెట్‌తో సరిపుచ్చారు."

"బ్రహ్మాండం, మరింకేం కావాలి. ఇంతకీ ఏమిటా కాల్సియోరేరియా?"

"ఓ అదా, ఏదో కాల్సియోరేరియా లాగా కనిపించే పువ్వులే. అది ఏమిటో నాకూ సరిగా తెలీదు."

"ఓహో. అయినా నువ్వు చాలా త్వరగా వచ్చినట్టున్నావే?"

"మేము అను. మీ మావయ్య కళ్ళు తిరుగుతున్నాయని, వడదెబ్బ కొటినట్టు వుందంటూ ఒకటే గోలనుకో. అదిగో మొసగాడు రానే వచ్చాడు."

మొహమంతా కందిపోయి వయసులో హేమలతకన్నా ఓ పదేళ్ళు ఎక్కువున్న సంజీవరావు పడిపోడానికి సిద్ధంగా వున్నట్టు అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికొచ్చాడు. అతను వేసుకున్న సూటు, నెత్తి మీదున్న పెద్ద టోపీ శీను దృష్టిని ఆకర్షించి, "మైగాడ్! యుగయుగాల ప్రేమికులు!" అన్నాడు.

చెమటతో తడిసిపోయిన భర్తని చూసి హేమలత, "లోపలకి రావచ్చు, వేషాలమారి!" అంది.

సంజీవరావు నుదురు తుడుచుకున్నాడు.

"నేనేం వేషాలమారిని కాను! నిజం చెబుతున్నా, మూర్ఛ వచ్చినంత పనయింది నాకు. ఆ వెధవ ప్రదర్శనకి సూటు, బూటు, నెత్తిన యింత పెద్ద టోపీ పెట్టుకుని వెడితే ఎవడికి మాత్రం రాదంటా? చచ్చిపోతాననుకున్నా. నీడలోనే టెంపరేచరు 110 డిగ్రీలుంది."

దానికి శీను, "మీరు నీడలోకి పోకుండా వుండాల్సింది కదా," అన్నాడు.

సంజీవరావు తన మీద తనే జాలి పడుతూ, "అసలు యిలాంటి దౌర్భాగ్యపు వాటికి ఏటా నన్నెందుకు లాగుతారో తెలుసుకోవాలనుకుంటున్నా," అన్నాడు.

దానికి హేమలత, "అయ్యా, కుటుంబం నించి ఎవరో ఒకరు వెళ్ళడం తప్పదు కదా," అన్నది.

"మరైతే చందూనే వెళ్ళాలిగా? అతనే కుటుంబానికి పెద్ద. ఈ జమీందారీ నాదా, చందూదా? ఇంతకీ చందూ ఎక్కడ? ఏ చెట్టుకిందో వూగుతూ పడుకునుంటాడు బహుశ."

"అదేం కాదులే. దేవుణ్ణి ప్రార్థిస్తూ గేరేజిలో కారు రిపేరు చేస్తున్నాడు," అని శీను చెప్పాడు.

ఆలోచిస్తూ హేమలత తల వూపింది. "అదీ సంగతి, దీంతో అసలు విషయం తేలిపోయింది. వినీలతో ఎంగేజ్‌మెంటు అయి వుండదు. ఒకవేళ అయుంటే చందూ ఆమెతోపాటే వుండేవాడుగా."

"ఆమె బాత్రూంలో స్నానం చేస్తోంది," చెప్పాడు శీను.

సంజీవరావు ఆశ్చర్యపోయాడు.

"ఎంగేజ్డా? ఎంగేజ్‌మెంట్ అయిందంటూ ఏమిటిదంతా? ఎవరన్నారా మాట?"

"పేపరు వాళ్ళు అనుకుంటున్నారలా. దాని గురించే కాసేపు ముందు ఫోన్ చేశారు కూడా."

"ఆ? ఏమిటీ? ఎందుకూ?"

శీను కలగచేసుకుంటూ, "నాదే తప్పనుకుంటా, మావయ్యా," అన్నాడు.

"నీదా?"

"అవును, నాదే. అసలేమైందంటే నా ఫ్రెండు భరత్ ఈ ఏడు కూడా వాళ్ళ నాన్నతో గొడవపడ్డాడు. ఈసారైతే ఆయనకి బట్టతల ఎంత త్వరగా పాకుతోందోనని విమర్శించాడు. దాంతో యిద్దరి మధ్య కలతలొచ్చాయి. భరత్ యిల్లు వదిలేసి చెన్నపట్నం చేరుకుని వదంతులు, పుకార్లు రాసే విలేఖరిగా వుంటూ సంపాదనకి ప్రయత్నిస్తున్నాడు. వాడికి

ఎంతో కొంత సాయం చేద్దామని అన్నయ్య చందూ ఎంగేజ్‌మెంటు గురించి భోజనాలయ్యాక టెలిగ్రాం పంపించాను."

"ఓరి తెలివితక్కువవాడా, చందూకి ఎంగేజ్‌మెంట్ కాలేదు," అని హేమలత చెప్పింది.

"ఓ యస్, అయింది."

"అని నీకు చెప్పాడా?"

"లేదు. కాని గులాబి తోటలో వినీలని ముద్దు పెట్టుకుంటుంటే చూశాను."

ఆశ్చర్యపోతూ హేమలత గట్టిగా అరిచింది.

"గులాబి తోటలోనా? హోరి భగవంతుడా! దాన్ని నువ్వు సాక్ష్యంగా తీసుకున్నావా! జీవితంలో సాధారణంగా జరిగే సంగతుల గురించి మీ అమ్మ నీకేమీ నేర్పలేదా? గులాబి తోటలో అందరూ ముద్దులు పెట్టుకుంటారని నీకు తెలియదా?"

దానికి అసూయపడుతూ సంజీవరావు, "అసలు నీకెలా తెలుసు అది?" అని అడిగాడు.

"నీకా సంగతి అనవసరం!"

వారిస్తున్నట్టు శీను చెయ్యి ఎత్తాడు.

"మీరేమీ విచారించవద్దు. అది ప్రత్యేకించి చాలా ఘాటైన ముద్దులే ... అంటే చాలాసేపు అలానే ... "

"ఓహో, అలాంటిదా?" అన్నది హేమలత కలలో వూహించుకున్నట్టు.

"అంతేకాదు, చందూ మొహం చూసి చెప్పగలిగాను కూడా."

"ఆనందపారవశ్యమా?"

"సగం పాలు ఆనందం, మిగతా సగం ఆందోళన. చాలాకాలం పాటు లీజుకి తీసుకునే యింటిని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోలేదేమోనని విచారించే మనిషి ముఖంలా వుంది."

సంజీవరావు ఆలోచిస్తూ గట్టిగా వూపిరి పీల్చి వదిలాడు.

"గుడ్, నువ్వనుకున్నది నిజమే అయితే ఎంత బావుంటుందో! లోక విఖ్యాతమైన చక్రవర్తి బ్రాండ్ వక్కపొడికి యజమాని అయిన చక్రవర్తిగారి వారసురాల్ని మన చందూ పెళ్ళి చేసుకున్నాడంటే ఏమవుతుందో గమనించు. చమురు బావి పడ్డట్టు కాదూ!"

హేమలతకి యింకా అనుమానంగానే వుంది.

"నీ వుబలాటాన్ని చల్లార్చాలని లేదు కాని, గులాబి తోట తప్పించి వేరే ఎక్కడైనా చందూ ఆమెని ముద్దు పెట్టుకుంటే బావుండేదని నాకనిపిస్తోంది. నాకా గులాబి తోటల వైనం సుపరిచితం."

"ఓహో?" సంజీవరావు భార్య వ్యాఖ్యానంతో కొంచెం దిగులు పడ్డా బదులు చెప్పే సాహసం చేశాడు. "ఒక విషయం చెప్తా వినండి, నేను పడుచుదనంలో వున్నప్పుడు ఆ గులాబి తోటల గురించి నీకెంత బాగా తెలుసో నాకూ అంతేగా వుండేది. ఇంకో సంగతి చెప్తా వినండి ... "

"ఇప్పుడు కాదు, తరవాత," అని శీను సలహా యిస్తూ, "శ్రోతల్లో చక్రవర్తిగారు కూడా వుండాలంటే మరి మీ యిష్టం," అన్నాడు.

సంజీవరావు మేనల్లుడు చూపించిన వైపుకి చూస్తూ, "ఆహా, సరే," అని జేబురుమాలతో టోపీ తుడుస్తూ కూచున్నాడు. తలుపు తెరుచుకుంటూ పొట్టిగా లావుగా వున్న వ్యక్తి లోపలికొచ్చాడు. చక్రవర్తి బ్రాండ్ వక్కపొడికి యజమాని అయిన చక్రవర్తి ఆనందంతో తేలిపోతున్నాడు.

"ఇదిగో ఇటు చూడండి! శుభవార్త విన్నారా మీరంతా?" అని అడిగాడు.

హేమలత ఆశ్చర్యపోతూ, "ఇంతకీ మీరనేది ... ?" అంది.

"అవును, నేననేది అదే. చంద్రశేఖర వర్మ, నా ముద్దుల కూతురు వినీలా."

"ఇప్పుడైనా ఒకళ్ళ మాట నమ్ముతారా?" అన్నాడు శీను.

"వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుందామనుకున్నారా?"

"అవును, వొప్పందం చేసుకున్నారు. వినీల నోటి నించే విన్నానిది. ఇప్పుడే మెట్ల మీద కలిసింది."

"గొప్ప శుభవార్త!" అన్నాడు సంజీవరావు.

"ఈ వార్త ఆనందించేదే అయినా కొంచెం ఆశ్చర్యంగా వుందని చెప్పాలి," అన్నది హేమలత.

"ఆశ్చర్యమా?" చక్రవర్తి గొంతులో మందలింపు ధ్వనించింది. "కమాన్, హేమలతగారూ! ఏవరో ఏదో అన్నట్టు ... "

"సరే, సరే, చక్రవర్తిగారూ, యిప్పుడా విషయం వొద్దులెండి. ఇదిగో వినీల రానే వచ్చింది," హేమలత హడావిడి పడుతూ అంది.

వినీల సన్నగా, పొడుగ్గా, నిర్లక్ష్యమైన వైఖరితో కనబడుతుంది. తండ్రి ఎంత వికారంగా వున్నా తల్లి వైపు నించి పోలికలు పుణికిపుచ్చుకున్నట్టు చాలా అందంగా వుంది. ఆమె వైఖరి నిర్వీర్యంగాను, అధమంగానూ వుంది.

"మై డియర్! నాన్నగారు యిప్పుడే శుభవార్త చెప్పారమ్మా," అన్నది హేమలత.

"ఓహో, అలానా?" అంది వినీల.

"నాకు చాలా సంతోషంగా వుంది," అన్నది హేమలత.

"థాంక్యూ."

"నాకూ చాలా సంతోషంగా వుంది."

"థాంక్యూ, సంజీవరావంకుల్."

శీను, "నేనూ సంతోషించా," అన్నాడు.

వినీల ఆవలింత ఆపుకుంటూ, "థాంక్యూ, శీనూ. మీరందరూ సంతోషించినందుకు నాకు ఆనందంగా వుంది," అన్నది.

"అధికార వర్గాల నించి వార్త వెలువడింది కనక కూచుని మళ్ళీ మా భరత్‌కి చక్కటి టెలిగ్రాం రాసి పంపిస్తా," అన్నాడు శీను.

ఆ మాట అని టేబులు దగ్గిరకి వెళ్ళి కుర్చీలో కూచుని నుదురు చిట్లిస్తూ సాహితీ సేవలో మునిగాడు. హేమలత కాబోయే పెళ్ళికూతురు చుట్టూ తిరుగుతూ ప్రస్తుతం వున్న స్థితిని మరింత వుత్సాహంతో, వుద్వేగంతో నింపాలని చూసింది.

"ఇలా జరగాలని ఎంతోకాలం నించి ఎదురు చూస్తున్నాన్నేను, నువ్వు ఆనందంగా వుండాలని నా కోరికమ్మా."

"చందూ మంచి వ్యక్తి," అన్నాడు చక్రవర్తి.

"పుట్టిన వాళ్ళందర్లోకీ చాలా గొప్పవాడు," అన్నాడు సంజీవరావు.

విసుగు పుట్టించే ఈ సంభాషణలోకి తనని బలవంతంగా లాగుతున్నారనే భావనలో వినీల, "అవును, వొప్పుకుంటున్నా, అతని గురించి చెప్పాలంటే గులాబి తోటలో ఏం చెయ్యాలో చక్కగా తెలిసినవాడని చెబుతా," అంది.

సంజీవరావు చిన్నగా దగ్గి, "అది అతని మేనత్త నించి సంక్రమించిందిలే," వెగటు పుట్టిన ధోరణితో చెప్పాడు.

హేమలత కళ్ళు అమాంతం మెరిసిపోతుండగా, "ఏం కూశావ్, మళ్ళీ అను," అంది.

దర్పం చూపిస్తూ సంజీవరావు, "నువ్వు విన్నావులే," అంటూ తలుపు దాకా వెళ్ళి, "నేనింక పైకెళ్ళి ఈ దరిద్రపుగొట్టు బట్టలు మార్చుకునొస్తా," అన్నాడు.

"సరే, కొంచెం వొదులుగా వుండే బట్టలు తీసి వుంచమని నౌకరుకి చెప్పు, ఆ తరవాత నువ్వు వేసిన జోకు గురించి మాట్లాడుదాం," అంది హేమలత.

శీను లేచి నుంచుని బెల్లు కొట్టాడు.

"నేను మిస్ చేశా, యింతకీ ఏమిటా జోకు?" అని అడిగాడు.

"ఆ సంగతి వొదిలెయ్. నీకోమాట చెప్తా విను. రాత్రికి మీ మావయ్యకి డ్రింకు లేదు," అంది హేమలత.

"భార్యగా మీకింత అనుభవం వుంది కనక చెప్పగలరనుకుంటా, భర్తని డ్రింకుకి దూరంగా ఎలా వుంచుతారో చెప్పండి," అని వినీల అడిగింది.

"వినీలా!" అన్నాడు చక్రవర్తి.

"చందూ ప్రస్తుతం సన్నబడాలని ప్రయత్నిస్తున్నాడు. కనక కొన్నేళ్ళ దాకా నీకా అవసరం రాదులే మై డియర్ వినీలా," హేమలత అన్నది.

మరోసారి వినీల ఆవులింతని ఆపుకుంటూ, "అవున్లెండి, యిప్పుడైతే కొంచెం అసహ్యంగానే కనిపిస్తున్నాడు," అన్నది.

మేఘం కమ్ముకున్నట్టు తలుపు దగ్గిర కేశవులు వచ్చి నుంచుని, "పిలిచారా మీరు మేడం?" అని అడిగాడు.

దానికి శీను, "నేనే బెల్లు కొట్టానయ్యా, ఇంతకీ గేరేజికి కారొచ్చిందా?" అని అడిగాడు.

"ఇంకా రాలేదయ్యా."

"ఈ టెలిగ్రాం పోస్టాఫీసుకి తీసుకెళ్ళాలి, గురవయ్య ఎక్కడున్నాడు?" అని శీను అడిగాడు.

"వంటగదిలో వున్నాడు సార్."

"సరే అయితే," మద్రాసులో వున్న మిత్రుడు భరత్ సంతోషంతో పొంగిపోగల టెలిగ్రాం తీసుకుని శీను వెళ్ళాడు.

బట్లరు కేశవులు, హేమలతని సంబోధిస్తూ, "క్షమించాలి మేడం," అన్నాడు.

"ఏమిటి, కేశవులూ?"

"రాజమ్మ గురించమ్మా."

“ఆ, అన్నట్టు తను ఈరోజు వస్తున్నట్టుంది కదూ?”

“అవునమ్మగోరూ.” అసలే విచారంలో వున్న కేశవులుకి యిది మరింత కుంగదీసినట్టు వున్నాడు. “కొడుకుతో పాటు వస్తోందమ్మా. మధ్యాన్నం వాళ్ళని నా గదిలో వుంచి బాగోగులు చూడమని తమరు అనుమతించారమ్మా. అయితే వాళ్ళిద్దరితోపాటు మరో కుర్రదాన్ని కూడా తెస్తున్నారట, ఆయమ్మ ఈమధ్యనే రాజారాం షాపులో లేడీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరిందంటమ్మా.”

“పరవాలేదులే, ఎంతమంది వస్తే అంత సందడి.”

“సరేనండమ్మా. నేను అడిగేది, ఆ కుర్రది మన తోటలో తిరగొచ్చా అనండమ్మా. బొంబాయి నించి వొచ్చిందంట. తవురికి తెలీందేముంది, ఆ వూళ్ళో యింత పాతకాలపు మేడలు, మిద్దెలు వుండవుగదండమ్మా, పైగా మన భవంతికి ఎంతో చరిత్ర వుంది కదమ్మా.”

“కేశవులూ, అలాగే కానియ్యి, యిష్టమొచ్చిన చోట తిరగనియ్యి.”

“సరేనండమ్మా.”

రాయబారులు సందేశాన్ని యిచ్చి తిరిగి వెళ్ళినట్టు ఆ బట్లరు నిష్క్రమించాడు.

హేమలత వైపు తిరిగి వినీల, “రాజమ్మా? చిన్నప్పుడు చూసుకున్నదంటూ చందూ చెప్పిన ఆ ఆయా ఏనా ఈమె?” అని అడిగింది.

“అవును, కేశవులుకి అక్క. పట్నంలో షాపుండే ఒక బార్బర్‌ని పెళ్ళి చేసుకుంది.” వున్నట్టుండి విసుగుదలతో, “తను స్థిరపడిన వూళ్ళోనే వుంటే బాగుంటుందని నాకనిపిస్తుంది,” అన్నదామె.

“ఆమెంటే మీకు యిష్టం లేదా?”

“ఆమెని చూస్తే చాలు నాకు మహా చిరాకేస్తుంది .”

“ఎందుకో?”

“ఆ ముసిల్ది చాలా చెడ్డది, పైగా ఒకటే తాగుతుంది కూడా. సరే, నేను కూడా యిప్పుడు మా ఆయనలాగా పైకి వెళ్ళి బట్టలు మార్చుకునొస్తా. ఈలోపల టీ అందిస్తావా అందరికీ?” అని హేమలత చెప్పి వెళ్ళింది.

“సరే, హేమలత పిన్నిగారూ. నాన్నగారూ, టీ యివ్వనా మీకు?”

ఆ యింటి గృహిణి వెళ్ళిపోయిన తరవాత కాసేపు తండ్రి, కూతుళ్ళ మధ్య మౌనమే నడిచింది. వినీల టీ టేబులు దగ్గిర పనిలో వుంటే, చక్రవర్తి నిలవు కిటికీ దగ్గిర నుంచుని లానుని, సరస్సుని చూస్తూ నుంచున్నాడు. అసంతృప్తితో కనుబొమలు ముడుచుకున్నాయి.

అది తను చూస్తున్న దృశ్యంలో ఏదో లోపం వున్నందువల్ల కాదని చిట్టచివరకి ఆయన మాటల్లో వెల్లడైంది.

కూతురు వంక తిరిగి మందలిస్తున్నట్టు చూసి, "ఈరోజుల్లో ఆడపిల్లలకి ఏమవుతోందో నాకు తెలీడం లేదని చెప్పాలి," అన్నాడు.

వినీల, "ఏమిటి మీరనేది?" అని అడిగింది.

చక్రవర్తి విషయానికొస్తూ, "నేను పాతకాలపు మనిషిని కావచ్చు, కాని ఇలాంటి పరిస్థితుల్లో నీలో కాస్తంత వుత్సాహం చూడాలనిపిస్తుంది నాకు," అన్నాడు.

వినీల నిట్టూర్చింది. తరచు తండ్రి మాటలు ఆమెకు విసుగు పుట్టిస్తుంటాయి.

"ఎందుకంత ఆవేశపడాలి?"

"ఆవేశం ఎందుకు పడకూడదంట?" అంటూ చక్రవర్తి రెట్టించాడు.

దానికి వినీల యిలా చెప్పింది: "ఎందుకు పడకూడదో నేను చెప్తా వినండి. ఇది కేవలం వ్యాపారం లాంటి సంబంధమని మీకూ తెలుసు, నాకూ తెలుసు. నావైపు నించి డబ్బు పెట్టుబడి పెడతాను, నాకేమో చందూ జమీందారిణి హోదా యిస్తాడు. కాస్తంత నిజాయితీగా వుందాం మనం. చందూని వలలో వేసుకునేందుకే మీరు నన్నిక్కడికి తీసుకొచ్చారు. వలలో వేసుకున్నా. దానికి సంబరపడాలనే వుద్దేశ్యం నాకు లేదు."

చక్రవర్తికి వొణుకు పుట్టింది.

"హుష్, గోడలకి చెవులుంటాయని తెలుసు నీకు!"

"ఇదంతా మీరూ, హేమలతగారూ పన్నిన పన్నాగమేనని మీకు తెలుసు కూడా. సన్నిహితం. వెన్నెల రాత్రుల్లో మేమిద్దరం కలిసి తిరగడం ... ఎవర్నో పిలిపించి సంధి కుదర్చడం ... "

"అవేం మాటలు! అలా మాట్లాడవద్దు", చక్రవర్తి బాధపడుతూ అన్నాడు.

వినీల ప్రశాంతంగా నుంచుని కప్పులో పంచదార వేసి కలిపింది.

"మీకో విషయం చెప్తా వినండి, అతను పెళ్ళి ప్రస్తావన తేగానే కూచున్న పక్షి మీద బాణమేసి కొట్టినంత సులువుగా అనిపించింది నాకు."

"చాల్లే, ఆపు!"

"నిజంగా నేను వుత్సాహం పుంజుకోవాలని మీరు చూస్తుంటే నాకు చేతనైనంత ప్రయత్నిస్తాను. నాన్నగారూ, చందూ నన్ను భార్యగా చేసుకోవాలనుందని చెప్పగానే, నా గురించి అతనలా భావిస్తున్నందుకు విస్తుపోయాను. అతనొక మేకపిల్లలాంటివాడు, నేనతన్ని

వె[ర్రిగా [ప్రేమిస్తున్నా. అతను కాకపోయినా నాకేమీ పరవాలేదు. ఇదంతా యింత సులభంగా ఎందుకయిందనే నాకు కోపంగా వుంది," అని వినీల చెప్పింది.

చ[క్రవర్తి వస్తున్న కోపాన్ని అణుచుకున్నాడు. ఇలాంటి సంభాషణల్లో కూతురిది అందె వేసిన చెయ్యి, తను ఆమెతో గెలవలేడని అనుభవం మీద తెలిసొచ్చింది.

"సరే, సులభమో కాదో, నువ్వయితే చేయాల్సింది చేశావు. అన్ని పేపర్లకి ఫోన్లో చెప్పేస్తానిప్పుడు."

"మరేమీ అనుకోనంటే యిక్కడి నించి వద్దు."

టెలిఫోను దగ్గిరకి వెడుతున్న చ[క్రవర్తి ఆగి, "అవునా?" అన్నాడు.

"ఈ శుభవార్తని మీరు గట్టిగా అరుస్తూ చెబుతుంటే నేను వినదలుచుకోలేదు. పోస్టాఫీసు నించి చెయ్యండి."

"ఓ సరే, సరే. ఆల్‌రైట్, ఆల్‌రైట్. జమీందారిణిగారు చాలా పట్టుదలతో వున్నట్టున్నారు, " అంటూ తలుపు దాకా వెళ్ళి ఆగి, "నువ్వప్పుడే ఈ జమీందారీకి రాణి కాదు. నిజంగా నువ్వు కావాలనుకుంటే చందూతో మాట్లాడేటప్పుడు జా[గ్రత్తగా వుండమని హెచ్చరిస్తున్నా," అంటూ చ[క్రవర్తి కూతురుకి హితబోధ చేశాడు.

"ఎందుకలా నాన్నగారూ! చందూతో వున్నప్పుడు నేను మాట్లాడతాననుకున్నారా? తెచ్చిపెట్టుకున్న సిగ్గుని అభినయిస్తా."

"చుప్!" అన్నాడు చ[క్రవర్తి.

అదే చివరి మాట కాకపోయినా, [ప్రస్తుతానికి అదే కనక నెగ్గినట్టయింది.

*

ఇలా జరిగిన సంభాషణ తరవాత కాసేపటిపాటు [డాయింగ్ రూములో వినీల వంటరిగా మిగిలిపోయింది. [ప్రశాంతంగా కాసిని బజ్జీలు తిని మరోసారి అందుకుంటుంటే పోస్టాఫీసుకి టెలి[గాం పంపడానికి పురమాయించి కాస్తంత తిని, టీ తాగుదామని శీను వచ్చాడు. అతనికి మధ్నాహ్నం పూట టీ అంటే మహా యిష్టం.

"హలో, ఏమిటి ఒక్కదానివే వున్నావా?"

"అవును, హేమలత పిన్నిగారు బట్టలు మార్చుకోడానికి పైకి వెళ్ళారు, నాన్నగారేమో వూళ్ళోకి వెళ్ళారు," అని వినీల చెప్పింది.

"ఓ, ఒక గుటక వేసుకుందామనా?"

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Neeve+Nenai+Nene+Neevai](http://kinige.com/book/Neeve+Nenai+Nene+Neevai)

* * *